క్లుప్తంగా

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన ఇందుమతి, కుమార్ దంపతులకు ఓ కుమార్తె(17) ఉంది. ఆమె విజయవాడలో వస్త్రాల దుకాణంలో పని చేస్తుంది. ఈ నెల 8న దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కటుంబ సభ్యులు 9వ తేదీన బట్టల దుకాణానికి వెళ్లి కుమార్తె విషయం అడుగగా ఆమె పనికి రాలేదన్నారు. దీంతో ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు కంకిపాడు మండల పరిషత్ సమావేశం

కంకిపాడు: మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు తెలుపుతూ ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండల ప్రగతి, పెండింగ్ పనులు, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షిస్తారన్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తారని చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థినులు డిగ్రీతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని అందులో భాగంగా కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో మంగళవారం జనశిక్షణ సంస్థాన్ సౌజన్యంతో టెక్స్‌టైల్ ప్రింటింగ్‌లో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థినులు ఆర్థిక స్వావలంబన సాధించడానికి బాతిక్ ప్రింటింగ్, టై అండ్ డై స్క్రీన్ ప్రింటింగ్‌ల కోర్సులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు 'సర్వోదయ' సత్కారం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా తొలి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తైన సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావును సర్వోదయ ట్రస్ట్ ప్రతినిధులు సత్కరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయనను కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సర్వోదయ ట్రస్ట్ ప్రతినిధులు కలెక్టర్ ఢిల్లీరావుకు అభినందనలు తెలిపారు. నగర నడిబొడ్డులో స్వాతంత్ర్య స్ఫూర్తికి చిహ్నంగా ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల సంఘం భవనాన్ని, గాంధీ విజ్ఞాన మందిరాన్ని అభివృద్ధి చేయాలని ట్రస్ట్ ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ట్రస్ట్ అధ్యక్షుడు జీవీ మోహన్ ప్రసాద్, కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, సభ్యులు మట్టా జయకర్, కొత్త విజయ కుమార్ ఉన్నారు.

నిబంధనల ఉల్లంఘనులకు జరిమానా

పటమట(విజయవాడతూర్పు): నగర వీధుల్లో జనావాసాలకు ఇబ్బంది కలిగించేలా వ్యాపారాలు చేస్తున్న వారికి మున్సిపల్ మొబైల్ కోర్టు జడ్జి యు.రామ్మోహన్ జరిమానా విధించారు. సర్కిల్-2 పరిధిలోని సత్యనారాయణపురం సర్కిల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కోర్టులో మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన 34 కేసుల్లో నిందితులకు రూ.11,660 జరిమానా వసూలు చేశారు. జరిమానా విధించిన వారిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించడం, విచ్చలవిడిగా పశువులను రోడ్ల పైకి వదిలివేసే వారినిరోడ్ల పైన చెత్త వేసే వారికి ఆయన కౌన్సెలింగ్ నిర్వహించి జరిమానా విధించారు. జడ్జి రామ్మోహన్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను వీఎంసీ అధికారులు అమలు చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చడానికి శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు దుకాణాలను తనిఖీ చేయాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మారిడి సందర్భంగా బుధవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈఈ పి.హరిబాబు తెలిపారు. చౌదరిపేట, ఓల్డ్‌చెక్‌పోస్టు, అశోక్‌నగర్, ధనేకులవారి వీధి, కాకతీయ రోడ్డు, యార్లగడ్డ అప్పారావు వీధి, ట్రెజరరీ ఎంప్లాయీస్ కాలనీ, ఇందిరానగర్ కట్టతో పాటు వెలగపూడి సత్యనారాయణకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి



గన్నవరంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ రవి, అధికారులు



రామవరప్పాడులో నివాళులర్పిస్తున్న ఎంపీపీ ప్రసన్నకుమారి తదితరులు

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- వాడవాడలా ఘనంగా పూలే జయంతి

పెనమలూరు: మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల పరిధిలో పూలే జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సనత్‌నగర్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే పార్థసారథి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తొలగించాలని జ్యోతిరావు పూలే పోరాటం చేశారన్నారు. సంఘసంస్కర్తగా ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. సమాజంలో అందరికీ సమన్యాయం ఉండాలని కోరుకున్న మహత్ముడు పూలే అన్నారు. నేటి యువత జ్యోతిరావు పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకోవలన్నారు. కార్యక్రమంలో తాడిగడప కమిషనర్ ఎస్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు చాన్‌బాషా, వేమూరి బాలకృష్ణ, తుమాటి శ్రీరాములు, ఈదా రాజేష్, అంగిరేకుల సీతారామయ్య, సైకం చినబాబు, పిన్నబోయిన రవి, అజీజుల్లా, హఫీజున్నీసా, సైదుఅహ్మద్, జాఫర్‌ఖాన్, ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

పోరంకి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎస్.ప్రకాశరావు ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కమిషనర్ ప్రకాశరావు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే ఎనలేని కృషి చేశారన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో..

బీసీ సంఘం ఆధ్వర్యంలో కానూరు రామాలయం వద్ద జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లభనేని మణికంఠ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూలే విగ్రహానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నేతలు డాక్టర్ మారిష్, వేముల బేబీరాణి, మోర్ల మహీధర్, ముచ్చు నాగేంద్ర, ఖాదర్, గాదె శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త పూలే..

రామవరప్పాడు: సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు పాటుపడాలని రూరల్ మండల ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పూలే జయంతిని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. దేశంలో అత్యంత ప్రతిభావంతులైన సామాజిక పరివర్తనకారుల్లో జ్యోతిరావు పూలే ముఖ్యమైన వారన్నారు. సమాజంలో కులవివక్షతను తొలగించడానికి, ఉన్నత విద్యను అందరూ అభ్యసించడానికి విశేష కృషి చేశారని చెప్పారు. స్త్రీ విముక్తికి ఆయన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. అనంతరం పూలే చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు, జెడ్పీటీసీ సువర్ణరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కానూరు సనత్‌నగర్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



ఉయ్యూరులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని



ఎమ్మెల్యే వంశీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నేతలు

ఎమ్మెల్యే వంశీ కార్యాలయంలో..

గన్నవరం: స్థానిక శాసనసభ్యుడు డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ కార్యాలయంలో సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, పార్టీ మండల కన్వీనర్ నీలం ప్రవీణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళుర్పించారు. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు, మహిళోద్ధరణకు పూలే చేసిన కృషిని స్మరించుకున్నారు. వైఎస్సార్ సీపీ నేతలు జలసూత్రం రామ్మోహన్‌రావు, లుక్కా ప్రసాద్, మెండెం రాంబాబు, పలు గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. స్థానిక సంక్షేమ బాలుర వసతి గృహంలో గుడ్‌మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించారు. అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పాడ చంద్రశేఖర్‌రావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, వాకర్స్ జిల్లా కమిటీ సభ్యులు చిల్లపల్లి శ్రీనివాసరావు, పీడీ ధనియాల నాగరాజు పాల్గొన్నారు. జెడ్పీ క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి ఎంపీపీ అనగాని రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలను స్మరించుకున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు టి.బాబీ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి.వెంకటలక్ష్మి, కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్, గృహ నిర్మాణ శాఖ ఏఈ సాయ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పూలే..

ఉయ్యూరు: మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పూలే జయంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి చైర్మన్ వల్లభనేని నాని, వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కమిషనర్ వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, ఎంఏ బేగ్, సచివాలయ కన్వీనర్ వణుకూరు సురేష్, అధికారులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విమాదేవి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లైబ్రరీలో దళిత ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పినమాల నాగకుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

సమతావాది పూలే

గన్నవరంరూరల్: సమతావాది, దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని వక్తలు కీర్తించారు. మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.కృపానందం ఆధ్వర్యంలో పూలే జయంతిని గ్రామస్తులు, పాఠకులు నిర్వహించారు. పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

రాజన్న పాలన అందిస్తున్న సీఎం జగనన్న

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

పెనమలూరు: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన తరువాత ఆయన తనయుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తమ వంటి పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని ముజిబర్ రెహమాన్, అబ్దుల్ షంషాద్‌జహ, షేక్. హజరాబీ అన్నారు. కానూరు సనత్‌నగర్‌లో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందిన పథకాల వివరాలు తెలుపుతూ బ్రోచర్‌లు అందజేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ.. రాజన్న పాలనలో తమకు ఎంతో మేలు జరిగిందన్నారు. నేడు జగనన్న వచ్చిన తరువాత సంక్షేమ పథకాలు నేరుగా తమ ఇంటికే వచ్చాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ఎటువంటి అక్రమాలు జరగటంలేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. కాగా స్థానికంగా డ్రెయినేజీలు పూడుకుపోయి మురుగునీరు నిలిచి దోమలు బాగా పెరిగాయని ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు వెంటనే పరిష్కారం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.



సనత్‌నగర్‌లో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని నేడు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అన్నివర్గాల ప్రజలకు ఎంతో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. మహానేత ఆశయాలకు అనుగుణంగానే జగనన్న పాలన ఉందని తెలిపారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, నేతలు చాన్‌బాషా, వేమూరి బాలకృష్ణ, జాఫర్‌ఖాన్, షేక్.సేదుఅహ్మద్, అజీజుల్లా, ఖాదర్, చోటుఖాన్, సాబు, అంగిరేకుల సీతారామయ్య, పిన్నబోయిన రవి, ఈదా రాజేష్, సైకం చినబాబు, హఫీజున్నీసా, శ్రీరాములు, ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నీలం

గన్నవరం: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కేసరపల్లి గ్రామానికి చెందిన నీలం సురేష్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో మంగళవారం జరిగిన క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు నేతృత్వంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీలను నియమించారు. పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు సంబంధించి గన్నవరం మండల అధ్యక్షుడిగా వీఎన్ పురం కాలనీకి చెందిన వడ్లమూడి రాజు, ఉంగుటూరు మండల అధ్యక్షుడిగా బొకినాల ఇస్సాక్, బాపులపాడు మండల అధ్యక్షుడిగా ఓగిరాలకు చెందిన బేతపూడి బాబును నియమించినట్లు జయరాజు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొమరవల్లి కిరణ్‌మూర్తి(బాపులపాడు), జిల్లా కార్యదర్శి దావులూరు కరుణాకర్(గన్నవరం), కార్యనిర్వాహక సభ్యులు బొకినాల శామ్యూల్(వేంపాడు), బొడ్డు బాబురావు(గొల్లనపల్లి) నియమించినట్లు చెప్పారు. పార్టీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర కమిటీ, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదేశాల మేరకు ఈ నియమకాలు చేపట్టామన్నారు. పార్టీ బలోపేతానికి పాటుపడాలని కోరారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీలు కాకాని వెంకటేశ్వరరావు, తవ్వా పూర్ణచంద్రరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం అష్టోత్తర కలశాభిషేకం, ప్రతి ఇంటి నుంచి ఒక బిందె నీళ్లతో స్వామి వారికి చందన జలాభిషేకం తదితర కార్యక్రమాలను ప్రారంభిస్తామన్నారు. 13న సహస్ర పుష్పార్చన, దైవీక రాయభారోత్సవం, 14న ఉదయం లక్ష్మీ సహస్ర నామ హోమం, రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. 15వ తేదీన సంతానార్థులకు మూలమంత్ర హోమం, సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం, 16న సుదర్శన హోమం, వసంతోత్సవం, శ్రీచక్రస్నానం నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని కోరారు.

మసీదు నిర్మాణానికి పూర్తి సహకారం

పటమట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గంలోని ఏపీఐఐసీ కాలనీలో ఉన్న మసీదును భవిష్యత్తులో రోడ్డు విస్తరణలో భాగంగా తొలగిస్తే అందుకు ప్రత్యామ్నాయంగా మున్సిపల్ కార్పొరేషన్ స్థలాన్ని మంజూరు చేసి మసీదు నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, కార్పొరేషన్ అధికారులతో కలిసి మంగళవారం ఆ మసీదును సందర్శించిన అవినాష్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న అవినాష్

కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు మీర్ హుస్సేన్, కో ఆప్షన్ సభ్యుడు అలీం, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలనకు ప్రజా మద్దతు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఇంట మద్దతు పలుకుతున్నారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కై లే జ్ఞానమణి అన్నారు. బాపులపాడు మండలంలోని కె.సీతారామపురం, శేరినరసన్నపాలెం, ఇందిరానగర్, కొత్తపల్లి, బిళ్లనపల్లి, మడిచర్ల గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో పాటుగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి నేరుగా ప్రజలను కలిశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు పాలనకు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడాను వివరించారు.

వివక్షతకు తావు లేకుండా పాలన..

ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ మాట్లాడుతూ.. పేదల పక్షపాతి సీఎం జగన్ అని చెప్పారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు మాట్లాడుతూ కుల, మత, రాజకీయ వివక్షతకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజల అనుమతితో జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అంటించారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, సర్పంచ్‌లు అడపా అంజిబాబు, సరిపల్లి కమలాభాయి, అజ్మీరా శాంతమ్మ, చెన్నుబోయిన మహాలక్ష్మి, షేక్ హసీనా బీ, వెలివెల రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు యర్రంశెట్టి రామాంజనేయులు, పుట్టా మదన్‌మోహన్, పార్టీ నాయకులు చెరుకూరి శ్రీనివాస్, కొమరవల్లి కిరణ్‌మూర్తి పాల్గొన్నారు.



శేరినరసన్నపాలెంలో స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న జ్ఞానమణి, నక్కా గాంధీ, నాయకులు

జగనన్నే మనందరి భవిష్యత్

ఉయ్యూరు: జగనన్నే అందరి భవిష్యత్ అని ఎంపీపీ చీలి కల్పన అన్నారు. మండలంలోని కలవపాముల గ్రామంలో సర్పంచ్ పానుగుమాటి బాలస్వామితో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. 16వ వార్డులో కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయాన్ని సేకరించి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్'

రామవరప్పాడు: ఎనికేపాడు, నిడమానూరు, ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల్లో పార్టీ నాయకులు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు గడప గడపకూ పర్యటిస్తూ మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఎనికేపాడు వాటర్ ట్యాంక్ బజారు సచివాలయం-2 పరిధిలో ఎంపీటీసీ రాచమళ్ల రత్నకుమారి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు. స్థానిక నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర ఉజ్వల భవిత

కంకిపాడు: జగనన్నతోనే రాష్ట్ర ఉజ్వల భవిత సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు, ఉప్పలూరు, తెన్నేరు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు బేతపూడి సురేష్, నాయకులు బీహెచ్ రాజగోపాల్‌రెడ్డి, బీహెచ్ గిరిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

జూపూడి(ఇబ్రహీంపట్నం): మండలంలోని నిమ్రా ఫార్మసీ కళాశాలలో ఏపీ సోర్స్ ఇండియా సంస్థ మంగళవారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించింది. డీ ఫార్మసీ, బీ ఫార్మసీ 4వ ఏడాది చదివే 67 మంది పాల్గొనగా ఇంటర్వ్యూలో 10 మంది ఎంపికైనట్లు కళాశాల అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణ మూర్తి తెలిపారు. సంస్థలో మెడికల్ కేడెట్‌గా ఎంపికైన 10 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఎంపికైన బాలికలను ఏపీ సోర్స్ ఇండియా సంస్థ హెచ్ఆర్ మేనేజర్ ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్ జనార్దన్ అభినందించారు.

ఎస్టీపీ పరిశీలన

పటమట(విజయవాతూర్పు): రామలింగేశ్వరనగర్‌లోని ఎస్టీపీ(సూయేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను 'మోడల్'గా మార్చాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆయన నగర పర్యటనలో భాగంగా మంగళవారం సర్కిల్ -3 పరిధిలోని రామలింగేశ్వర నగర్ 15, 16 లోని 20 మినిమల్ లిక్విడ్ డిశ్చార్జ్(ఎంఎల్‌డీ సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు.

వికసించిన బ్రహ్మకమలం

గన్నవరం: హిమాలయాల్లో మాత్రమే వికసించే అరుదైన బ్రహ్మకమలం పుష్పం గన్నవరంలోని విద్యానగర్‌లో పుష్పించింది. ఐఏఎస్ విశ్రాంత అధికారి డాక్టర్ డి.సాంబశివరావు సోదరి స్వరాజ్యం ఇంటి ప్రాంగణంలో పూసిన బ్రహ్మకమలం పుష్పం అందరిని ఆకట్టుకుంటుంది. సోమవారం అర్ధరాత్రి 11.30 గంటలకు పుష్పించడం ప్రారంభమయ్యిన బ్రహ్మకమలం 12.30కు పూర్తిగా వికసించిందని స్వరాజ్యం తెలిపారు. పరమ శివుడికి అత్యంత ప్రీతి పాత్రమైన ఈ పుష్పం ఏడాదికి ఒకసారి మాత్రమే పూస్తుందన్నారు. మూడేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి నాటిన బ్రహ్మకమలం మొక్క ఇప్పటికి పుష్పించిందని తెలిపారు. కేవలం హిమాలయాల్లో మాత్రమే పుష్పించే బ్రహ్మ కమలం పువ్వులతో శివుణ్ణికి అర్పిస్తారని చెప్పారు.



పుష్పాన్ని చూపిస్తున్న స్వరాజ్యం(ఇన్‌సెట్) పూర్తిగా వికసించిన బ్రహ్మకమలం

కరుమారి అమ్మన్ ఆలయానికి మరింత ప్రాచుర్యం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): సహస్ర చండీ యాగంతో శ్రీదేవి కరుమారి అమ్మన్ ఆలయానికి మరింత ప్రాచుర్యం లభిస్తుందని, నగరంలోని ప్రముఖ ఆలయాల చెంత చేరుతుందని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. నైనవరం ఫ్లైఓవర్ దిగువన శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠం ఆవరణలో మహా చండీ విగ్రహ నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని, నగరంలోనే తొలి సారిగా 72 అడుగుల మహా చండీ విగ్రహాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. చెన్నై నుంచి విచ్చేసిన వంద మంది నిపుణులు అమ్మవారి విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్నారన్నారు. తొలుత గౌతమ్‌రెడ్డి, మల్లాది విష్ణు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం పీఠాధిపతి కరుమారి దాసు అమ్మవారి తీర్థప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో పీఠం కోశాధికారి జ్ఞానేశ్వర్, సునీత, మాదల శ్రీనివాస్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు చంద్రకళ, బత్తిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విష్ణుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న పీఠాధిపతి